# రేపు మంత్రి పొంగులేటి 'ప్రజలతో ముఖాముఖి'

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** రెవెన్యూ, గృహనిర్మాణం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గాంధీభవన్‌లో ఇందిరాభవన్‌లో ఆయన విన్నపాలు స్వీకరించనున్నారు. ప్రజపాలనలో భాగంగా పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో తొలుత పెద్దఎత్తున ప్రజలు తమ సమస్యల సాధనకు ఈ వేదికను ఉపయోగపడుతోందని భావించి పెద్దఎత్తున వినతలు ఇచ్చేవారు, కానీ ఇటీవల రేషన్ కార్డుల కోసం ఇతర సమస్యల కోసం దరఖాస్తుదారులు విన్నపాలు చేసుకోవడం తగ్గింది.

# పిటిషన్స్ కమిటీ ప్రజల గొంతుక

## శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

### పిటిషన్స్ కమిటీ ప్రథమ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 20:** సోమవారం తెలంగాణ శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో శాసన మండలి పిటిషన్స్ కమిటీ ప్రథమ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన సభ వ్యవహారాల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, రెహ్మాత్ బేగ్, దామోదర్ రెడ్డి, కోదండరాం, మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పిటిషన్స్ కమిటీ అనేది ప్రజల గొంతుక లాంటిది. ఈ కమిటీ సభ్యులందరు చురుకుగా పని చేస్తే ప్రజల్లో మంచి పేరు, గుర్తింపు వస్తుంది. లేజిస్లేచర్ కమిటీలో సభ్యులుగా ఉండటం బాధ్యతగా భావించాలని సూచించారు. పిటిషన్స్ అనేవి భవిష్యత్ లో పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని పక్క ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తెలిపారు.

శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ, శాసన మండలి సభలను అధికార, ప్రతిపక్ష అనే తారతమ్యం లేకుండా నడుపు తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కమిటీలను నియమించుకున్నామని, పిటిషన్ అనేది లేజిస్లేచర్ నమూనా పద్దతిలో ఇవ్వాలి, అలా ఇస్తేనే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. లేజిస్లేచర్ కమిటిలలో స్థానం దక్కడం అదృష్టంగా భావించాలి. కమిటీలల్లో చురుకుగా పని చేస్తే అనుభవం పెరుగుతోందన్నారు. గతంలో నేను కూడా అసెంబ్లీ లైబ్రరీ కమిటీలో పనిచేసి నేడు ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు. డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ శాసన మండలి పిటిషన్స్ కమిటీ చైర్మన్‌గా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నా కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. సభలను, కమిటీలను సజావుగా నడిపేందుకు పూర్తి సహకారం అందిస్తున్న శాసన సభ స్పీకర్, శాసన మండలి చైర్మన్, శాసన సభ వ్యవహారాల మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.






నిమ్స్‌లో బాలింతలను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

## బాన్సువాడ ఘటనపై విచారణ జరిపి బాధితులను ఆదుకోవాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 20, ప్రభాతవార్త:** బాన్సువాడ మాతాశిశు ఆసుపత్రిలో సిజేరియన్ అనంతరం ఇన్‌ఫెక్షన్ బారినపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలింతలను మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ 10 మంది బాలింతలు ఇన్‌ఫెక్షన్ బారినపడినా ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర నిరక్ష్యమని విమర్శిం చారు. ఆపరేషన్ థియేటర్ నిర్వహణలో లోపాలు, వైద్యుల నిరక్ష్యం, కాలం చెల్లిన మందుల వినియోగం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరో పించారు. ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిసిన తర్వాత కూడా అదే థియేటర్‌లో మరిన్ని సిజేరి యన్లు చేయడం వైద్య శాఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుం బాలకు పూర్తిస్థాయి వైద్యం అందించి, తగిన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఖమ్మంలో అత్యా చారానికి గురైన మైనర్ బాలిక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రాష్ట్ర అభివృద్ధి కోసం పరమేశ్వరుడిని ప్రార్థించా: పిసిసి చీఫ్ మహేశ్

**హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త:** నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ ఉమామహేశ్వర ఆలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ప్రత్యేక అభిషేక పూజల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పరమేశ్వరుడిని ప్రార్థించానని తెలిపారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య సుమారు గంటపాటు అభిషేకం ప్రత్యేక పూజలు మహేష్‌కుమార్ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు




## హైదరాబాద్‌లో సిఐఎస్ఎఫ్ వారి 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026

### 23 నుంచి 30 వరకు 5 క్రీడాంశాల్లో పోటీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై20:** అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నిర్వహించే 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్- 2026 గచ్చిబౌలిలోని జీఎమ్‌సీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈనెల 23 నుంచి 30 వరకు జరగనుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 36 రాష్ట్ర పోలీస్, కేంద్ర సాయుధ భద్రతా దళాల (సీఏపీఎఫ్) సంస్థలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని జూడో, వుషు, టేక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ క్రీడాంశాలలో పోటీపడనున్నారు. ఆయా జాతీయ సమాఖ్యలకు చెందిన దాదాపు 150 మంది సాంకేతిక అధికారులు ఈ పోటీలను పర్యవేక్షి ంచనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో (ఎన్ఐఎస్ఏ) నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో (కర్టెన్ రైజర్‌కమ్‌ప్రెస్ కాన్ఫరెన్స్) ఈ ఛాంపియన్‌షిప్ వివరాలను వెల్లడించారు. మీడియాను ఉద్దేశించి ఎన్ఐఎస్ఏ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ.. ఈ ఛాంపియన్‌షిప్ పోలీస్, సీఏపీఎఫ్ సిబ్బందిలో క్రీడా సంస్కృతిని పెంపొందించడంతో పాటు అథ్లెట్లు తమ ప్రతిభను, క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవడానికి ఒక జాతీయ వేదికను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఒలింపియన్ పారుపల్లి కశ్యప్, ప్రముఖ రోయింగ్ కోచ్ ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ.. యూనిఫాం ధరించే దళాలలో క్రమశిక్షణ, సహనశీలత, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉద్ఘాటించారు.

ఈ ఛాంపియన్‌షిప్ అథ్లెట్లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026 రానున్న వేళ ఈ ఛాంపియన్‌షిప్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందులో పోటీపడుతున్న అయిదు క్రీడల్లో జూడో, వుషు, టేక్వాండో, కరాటేలు ఆసియా క్రీడల్లో కూడా ఉన్నాయి. పోలీస్, సీఏపీఎఫ్‌లకు చెందిన అథ్లెట్లకు అంతర్జాతీయ స్థాయికి ఉపయోగపడే విలువైన పోటీ అనుభవాన్ని ఇది అందించనుంది. తెలంగాణ రాష్ట్ర జంతువైన మచ్చల జింక (చిటాల్) ఆధారంగా రూపొందించిన ఈ ఛాంపియన్‌షిప్ మస్కట్ వీరాను ఆవిష్కరించారు. ఇది సజీవత, ప్రభావ శీలత, సహనశీలత, చురుకుదనం అనే గుణాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది మార్షల్ ఆర్ట్స్, భద్రతా దళాల స్ఫూర్తిని తెలియజేస్తోంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఇతర భాగస్వామ్య సంస్థలు రవాణా, నిర్వహణ సహకారాన్ని అంది స్తు న్నాయి. నిర్ణీత నిబంధనలకు అనుగుణంగా నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) యాంటీడోపింగ్ పరీక్షలను నిర్వహిస్తుంది. పాల్గొనే క్రీడాకారులు, అధికారుల కోసం సమగ్రమైన వైద్య, వసతి ఏర్పాట్లు చేశారు.

## యాదాద్రి థర్మల్ విద్యుత్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పవర్ ఎంప్లాయీస్ జెఏసి నిరసన

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్ అండ్ యాష్ హ్యాండ్లింగ్ యూనిట్ల కార్యకలాపాలను ప్రైవేటీ కరించేందుకు టెండర్లు ఆహ్వానించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు సోమవారం డివిజనల్ ఇంజనీర్ (డీఈ) కార్యాలయ ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. టీజీపీఈజేఏసీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు, విద్యుత్ కార్మికులు, సిబ్బంది తమ వ్యతిరేకతను నమోదు చేయడానికి నల్ల బ్యాడ్జీలు ధరించి డీఈ కార్యాలయానికి చేరుకున్నారు. భోజన విరామ సమయంలో, ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో గుమికూడి, విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా తీవ్ర నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లాభదాయకమైన ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రయత్నాన్ని టీజీపీఈజేఏసీ నాయకులు ఖండించారు. బొగ్గు, బూడిద నిర్వహణ వంటి కీలక విభాగాలను ప్రైవేటీకరించడం కార్మికుల హక్కులకు, అలాగే ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థల దీర్ఘకాలిక మనుగడకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా తమ నిరసనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. టీజీపీఈజేఏసీ సెక్రటరీ జనరల్ రాంజీ నాయక్, కన్వీనర్ అర్మల్లా ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు) సుందర్ సతీష్ మరియు శంకర్‌లతో పాటు, పెద్ద సంఖ్యలో డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు మరియు సిబ్బంది ఈ ప్రదర్శనలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

## మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

### రాష్ట్ర ఆరోగ్య శాఖ పనితీరుకు కేంద్రం ప్రశంసలు

### ప్రోత్సాహకంగా రూ.200 కోట్ల అదనపు నిధుల మంజూరు

### హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** మాతా శిశు ఆరోగ్య సేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రం సాధించిన ఫలితాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.200 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసిందని సోమవారం వెల్లడించారు. ఈ నిధులను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతాశిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హాస్పిటళ్లలో నవజాత శిశు సంరక్షణ విభాగాల విస్తరణ, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్లను జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికీకరణ, మిడ్‌వైఫరీలెడ్ కేర్ యూనిట్లు, కంగారూ మదర్ కేర్ (కెఎంసి) వార్డులు, లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో తల్లి, గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని అత్యాధునిక పరికరాలతో పర్యవేక్షించే వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా తీర్చిదిద్ది, నేషనల్ క్వాలిటీ అష్యూరన్స్ (ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ పొందేలా మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలను మరింత బలోపేతం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ ప్రోత్సాహక నిధులు రాష్ట్రంలో మాతృ మరణాలు, నవజాత శిశు మరణాలను మరింత తగ్గించడంతో పాటు ప్రతి ప్రభుత్వ హాస్పిటల్‌లో నాణ్యమైన మాతాశిశు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఎంతగానో ఉపయోగపడుతాయని సంగీత సత్యనారాయణ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్స్‌లో 2 స్వర్ణ, 2 రజత పతకాలతో నారాయణ సరికొత్త చరిత్ర

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** ప్రపంచస్థాయి సైన్స్ పోటీలలో నారాయణ విద్యార్థులు మరోసారి భారతదేశ పేరును అంతర్జాతీయ వేదికపై మారుమోగించారు. ఇటీవల ముగిసిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబివో) 2026, 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపి యాడ్ (ఐసీహెచ్‌వో) 2026 పోటీలలో నారాయణ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో 2 స్వర్ణాలు, 2 రజత పతకాలు కైవశం చేసుకున్నారు. శాస్త్రీయ రంగానికి అద్భుతమైన ప్రతిభను అందించడంలో తమకున్న అగ్రగామి స్థానాన్ని నారాయణ విద్యాసంస్థలు ఈ విజయంతో మరొకసారి చాటిచెప్పాయి. విల్నియస్, లిథువేనియాలో జరిగిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబివో 2026)లో భవ్యా గున్వాల్ గోల్డ్ మెడల్ (స్వర్ణం), అన్మోల్ కుమార్ సిల్వర్ మెడల్ (రజతం), నిషిత్ కలాని సిల్వర్ మెడల్ (రజతం) సాధించారు. మొత్తం 78 దేశాల నుండి 307 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో, భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన నలుగురిలో ముగ్గురు నారాయణ విద్యార్థులే కావడం విశేషం. ఆరు గంటల ప్రాక్టికల్, థియరీ పరీక్షలను ఎదుర్కొని టీమ్ ఇండియా మొత్తం 1 గోల్డ్, 3 సిల్వర్ పతకాలను సాధించింది. అలాగే తాష్కెంట్, ఉజ్బెకిస్తాన్లో జరిగిన 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసీహెచ్‌వో 2026) సందీప్ కూచి గోల్డ్ మెడల్ (స్వర్ణం) సాధించాడు. కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో టీమ్ ఇండియా 4 స్వర్ణ పతకాలతో రికార్డు సృష్టించగా, అందులో సందీప్ కూచి కీలక పాత్ర పోషించాడు. గత ఏడాది (2025) దుబాయ్ లో జరిగిన 57వ ఐసీహెచ్‌వోలో కూడా స్వర్ణం సాధించిన సందీప్, వరుసగా రెండోసారి అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించి తన అసాధారణ నైపుణ్యాన్ని నిరూపించుకున్నాడు. అంతర్జాతీయ విజయాలతో పాటు, మన దేశంలో అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలోనూ నారాయణ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధించారు. సందీప్ కూచి జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 లో ఆల్ ఇండియా 5వ ర్యాంక్, భవ్యా గున్వాల్, నీట్-యుజి 2026 లో ఆల్ ఇండియా 71వ ర్యాంక్, (భవ్యా గతంలో రొమేనియాలో జరిగిన ఐజేఎస్‌వో2024లో గోల్డ్, ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఐబివో 2025లో సిల్వర్ మెడల్స్ సాధించింది. అంతేకాక ఒక స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీవో) ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తూ మార్గదర్శిగా నిలుస్తోంది. ఇటీవలే కొలంబియాలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపీహెచ్‌వో) 2026లో శ్రేష్ సురయ గోల్డ్ మెడల్ సాధించగా, ఆ విజయంతో కలిపి కేవలం ఒకే వారంలో నారాయణ విద్యార్థులు మొత్తం 3 స్వర్ణాలు, 2 రజత పతకాలను భారత్‌కు అందించడం గమనార్హం. ఈ చారిత్రాత్మక విజయంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి పొంగూరు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు నారాయణ వేదికగా మారిందన్నారు. అంతర్జాతీయ బయాలజీ మరియు కెమిస్ట్రీ ఒలింపియాడ్స్ 2026లో మన విద్యార్థులు 2 స్వర్ణాలు, 2 రజతాలు సాధించడం ఎంతో గర్వ కారణమన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల అంకితభావం నారాయణ అకడమిక్ వ్యవస్థకి ఇది ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుం దన్నారు. శ్రేష్ సుదయ విజయం తర్వాత సందీప్, భవ్య, అన్మోల్, నిషిత్ సాధించిన ఈ విజయాలు నారాయణ అద్భుతమైన విజయ ప్రస్థానాన్ని నిర్విఘ్నంగా కొనసాగించినట్లు తెలిపారు. 17 సంవత్సరాలకు పైగా అనుభవం, నైపుణ్యం, అంకితభావం సూత్రాలతో విద్యార్థుల కలలను నిజం చేస్తూ, అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించడంలో నారాయణ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.




## 2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందే

### తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం

**హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త:** ఇంక్రిమెంట్ కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందేనని తీర్పునిచ్చిందని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్(టిజిఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం తెలిపారు. జూనియర్ లెక్చరర్ల ప్రయోజనాల కోసం తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం, సెక్రటరీ సిద్ధారెడ్డి తెలిపారు. జూనియర్ లెక్చరర్ల ఇంక్రిమెంట్ కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2023 బ్యాచ్ లెక్చరర్లకు ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందేనని, ఈ ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయాలని తీర్పునివ్వడంతో న్యాయం గెలిచిందన్నారు. ఈ కేసులో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లను కోర్టు కొట్టు వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం తరఫున ఏజీ రాహుల్ రెడ్డి, 2025వ బ్యాచ్ అధ్యాపకుల తరఫున అడ్వకేట్ రచనరెడ్డి వాదించినట్లు చెప్పారు. తమ సంఘం తరఫున నాయక్ వాడి రమేష్ పూర్తి ఆధారాలతో వాదించి 2023 బ్యాచ్ అధ్యాపకులకు ఇంక్రిమెంట్ అందేలా కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేనందున సంబంధిత శాఖ తప్పనిసరిగా కోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. టీజీఎల్ఏ నిబద్ధత, చిత్తశుద్ధి, పోరాట పటిమతో ప్రతి దశలో అధ్యాపకుల ప్రయోజనాల కోసం ముందుకు సాగుతుందని కనకచంద్రం స్పష్టం చేశారు.

# పిజిఐ ర్యాంకింగ్‌లో టాప్‌లో ఉండేలా ప్రయత్నించాలి

### దేశంలో 18వ స్థానానికి అధికారుల సమష్టి కృషి దోహదం

### సదస్సులో విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) ర్యాంకింగ్‌లో దేశంలోనే టాప్‌లో ఉండేలా అధికారులు కృషి చేయాలని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. డీఈవోలతో పాటు ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారుల(డీఈవో)తో పాటు జిల్లా ప్రణాళిక సమన్వయకర్తలు, ఒక్కో జిల్లా నుంచి 7 మంది అధికారుల బృందానికి పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)పై విద్యాశాఖ రెండు రోజుల రాష్ట్ర స్థాయి రెసిడెన్షియల్ ఓరియంటేషన్ కార్యక్రమాన్నిహైదరాబాద్‌లోని ఎం.సి.ఆర్. హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ప్రారంభించారు. పాఠశాల విద్యా వ్యవస్థ పనితీరును అంచనా వేయడంలో పిజిఐ ఫ్రేమ్‌వర్క్, దాని సూచికలు, డేటా అవసరాలు, దాని ప్రాముఖ్యతపై జిల్లా విద్యా బృందాల అవగాహనను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా బృందాలకు వారి పనితీరును వివరంగా విశ్లేషించడానికి, సూచికల వారీగా లోపాలను గుర్తించడానికి, జిల్లాల మధ్య వ్యత్యాసాలకు గల కారణాలను అర్థం చేసుకోవడానికి, మెరుగుదల కోసం నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడానికి ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లా నుండి ఏడుగురు సభ్యుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటోంది. ఈ బృందంలో జిల్లా విద్యాధికారి, జిల్లా నాణ్యతా సమన్వయకర్త, జిల్లా ప్రణాళికా సమన్వయకర్త, సహాయ గణాంక సమన్వయకర్త, ఒక మండల విద్యాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు, ఒక క్లస్టర్ వనరుల వ్యక్తి ఉంటారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించి, జిల్లా బృందాలతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో టాప్ ర్యాంకు సాధించేందుకు నిరంతర కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర, జిల్లా విద్యా అధికారులను అభినందిస్తూ, పీజీఐ 2024-25లో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ, పీజీఐ 2025-26 నాటికి 18వ స్థానానికి మెరుగుపడి గణనీయమైన పురోగతి సాధించిందని కార్యదర్శి పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, క్లస్టర్, పాఠశాల స్థాయిలలో పనిచేస్తున్న అధికారులు, కార్యకర్తల సమిష్టి కృషి ఫలితమే ఈ మెరుగుదల అని ఆమె తెలిపారు. జిల్లా పీజీఐ ఫ్రేమ్‌వర్క్ కింద తెలంగాణలో మొదటి రెండు స్థానాలు సాధించిన జనగాం, మంచిర్యాల జిల్లాలను ఆమె అభినందించారు. పీజీఐని కేవలం ర్యాంకింగ్ ప్రక్రియగా మాత్రమే చూడకూడదని నొక్కి చెప్పారు. ఇది ఒక ముఖ్యమైన నిర్ధారణ చట్రమని, ఇది విద్యా వ్యవస్థ తన బలాబలాలను అర్థం చేసుకోవడానికి, నిరంతర లోపాలను గుర్తించ డానికి, అభ్యసన ఫలితాలు, ప్రాప్యత, మౌలిక సదుపాయాలు, సమానత్వం, పరిపాలన, నిర్వహణ వంటి అంశాలలో జోక్యాలకు ప్రాధా న్యత ఇవ్వడానికి సహాయ పడుతుందన్నారు. ప్రతి స్థాయిలో స్పష్టమైన జవాబుదారీతనంతో, డేటా సేకరణ, ధృవీకరణ, నిర్ధారణ కోసం పటిష్టమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కార్యదర్శి జిల్లా అధికారులను ఆదేశించారు. కేవలం మొత్తం స్కోరు లేదా ర్యాంకుపై దృష్టి పెట్టకుండా, సూచికల వారీగా పని తీరుపై అంతర్గత సమీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని జిల్లాలలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రణాళికబద్ధ కార్యాచరణతో ప్రతికూల వాతావరణానికి చెక్: పిసిసి చీఫ్

**హైదరాబాద్, జులై 20,ప్రభాతవార్త:** ప్రణాళికబద్ధమైన ప్రత్యామ్నాయ కార్యాచరణతో ఎల్‌నీనోతో తలెత్తే ప్రతికూల వాతావర్ణ పరిస్థితులను ఎదుర్కొందామని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం ప్రతికూల వాతావరణ పరిస్థితులపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిజామాబాద్‌లోని నూతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు.

సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై ప్రభావం, తాగునీటి లభ్యత, పశుగ్రాసం, సాగునీటి నిర్వహణ, ప్రజలకు అవసరమైన ముందస్తు చర్యలు, అత్యవసర ప్రణాళికల అమలుపై విస్తృతంగా సమీక్షించారు. మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం ఒక మిషన్‌మోడ్‌లో పనిచేయాలని అప్పుడే జీవజాలంపై కరువు ప్రభావం కనపడదని అన్నారు.

**తెలంగాణ జలసిరి పోస్టర్ ఆవిష్కరించిన మహేష్‌కుమార్‌గౌడ్**

నిజామాబాద్‌లోని నూతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రతికూలవాతావరణ పరిస్థితులు విపత్తు నివారణ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో 'తెలంగాణ జలసిరి - ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితిని ఎదుర్కొందాం' అనే అవగాహన పోస్టర్‌ను టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు.

# రామగుండంలో యూరియా ఉత్పత్తి పునఃప్రారంభం

### ఇప్పటి వరకూ ఎరువుల కోసం ఇబ్బంది పడిన రాష్ట్రాలు

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో, అమ్మోనియా పైప్‌లైన్‌లో లీకేజీ, సాంకేతిక సమస్యల కారణంగా వారం రోజులకు పైగా మూసివేసిన రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్) ఉత్పత్తిని తిరిగి ప్రారంభించింది. మరమ్మతుల తర్వాత ప్లాంట్ తిరిగి తెరవడంతో, ప్రభుత్వ రంగ సంస్థలో యూరియా ఉత్పత్తి పునః ప్రారంభమైంది. సాంకేతిక సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు అవసరమైన యూరియా డిమాండ్‌ను తీర్చడానికి ఉత్పత్తిని పెంచేందుకు తాము అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని వారు చెప్పారు. కాగా సాంకేతిక సమస్యల కారణంగా లీకేజీ సంభవించిందని సమాచారం. ఈ లీకేజీ వల్ల ప్లాంట్‌లోని అన్ని యూనిట్లను మూసివేయడంతో ఈ నెల 9వ తేదీన యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. ఉత్పత్తిని తిరిగి ప్రారంభించడానికి అప్పటి నుండి ప్లాంట్‌లో మరమ్మతు పనులు చేపట్టారు. ఇక ఇక్కడ యూరియా ఉత్పత్తి బంద్ కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మరో ఐదు రాష్ట్రాలకు ఎరువుల సరఫరా నిలిచిపోయింది. 2021 మార్చిలో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుండి, ఈ ప్లాంట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు యూరియా సరఫరాకు కీలక వనరుగా ఉందని పేర్కొంది.

కేవలం 2026 జూన్ నెలలోనే, రామగుండం యూనిట్ సుమారు 94,849 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసి, 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసిందని వివరించింది.

ఆ నెలలో, తెలంగాణకు 48,675.33 మెట్రిక్ టన్నులు, ఆ తర్వాత కర్ణాటకకు 28,338.66 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,655.60 మెట్రిక్ టన్నులు, మరియు మహారాష్ట్రకు 3,116.88 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేసినట్లు ప్లాంట్ అధికారవర్గాలు వెల్లడించాయి. దేశంలోని అతిపెద్ద యూరియా తయారీ కేంద్రాలలో ఒకటైన రామగుండం యూనిట్‌ను పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సాంకేతిక సమస్యలు తరచూ ఎదురవుతున్నాయి. మరోపక్క కొనసాగుతున్న ఖరీఫ్ పంట కాలంలో రైతు లకు యూరియా సరఫరాపై ఆందోళన నెలకొంది. ఈ ఏడాది అమ్మోనియా లీక్ కారణంగా రామగుండం ఎరువుల ప్లాంట్‌ను మూసివేయడం ఇది రెండోసారి. ఈ ఏడాది మార్చిలో ఈ ప్లాంట్‌ను వారం రోజుల పాటు మూసివేశారు. ఈ ప్లాంట్‌కు రోజుకు 3,850 టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ఏర్పడిన గ్యాస్ కొరత వల్ల ఇది కొంతకాలంగా 50 శాతం సామర్థ్యంతోనే పనిచేస్తోంది. తెలంగాణకు రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ మాత్రమే ఏకైక వనరు కాబట్టి, ఆ ప్లాంట్ నుండి వెలువడే యూరియా ఉత్పత్తి మొత్తాన్ని తెలంగాణకు కేటాయించాలని గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోంది.

ఖరీఫ్ సీజన్ ఉధృతంగా సాగుతున్న ఈ సమయంలో, పలు రాష్ట్రాల రైతులు ఈ ఎరువుల నిరంతర సరఫరాపై ఆధారపడి ఉన్నందున తరచూ సాంకేతిక సమస్యలు వచ్చి ఉత్పత్తి నిచిపోతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

